# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక శక్తిగా దేశం ఎదిగేందుకు కోల్ కతా వంటి నగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**
2. **కార్పొరేట్ సామాజిక బాధ్యత – సిఎస్ఆర్ నిధులతో ప్రతి మండలానికి అంబులెన్స్ సదుపాయం ఏర్పాటు చేస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**
3. **స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**
4. **రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.**
5. **దేశ వ్యాప్తంగా ఈరోజు జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

===========================

ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక శక్తిగా దేశం ఎదిగేందుకు కోల్‌కతా వంటి నగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కొల్‌కతాలో 5 వేల 2 వందల కోట్ల రూపాయల విలువైన మూడు మెట్రో రైల్ ప్రాజెక్టులను నిన్న ఆయన ప్రారంభించారు. ఆరు లైన్ల ఎక్స్ ప్రెస్ హైవే పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మెట్రో రైలులో కొద్దిసేపు ప్రయాణించారు. అనంతరం ప్రధాన మంత్రి మాట్లాడుతూ.. 2014కు ముందు దేశంలో కేవలం 250 కిలో మీటర్ల మేర మాత్రమే మెట్రో రైలు మార్గం ఉండేదని, ప్రస్తుతం వెయ్యి కిలోమీటర్లకు విస్తరించినట్లు చెప్పారు. దేశంలో రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని పేర్కొంటూ..

వాయిస్.. 34 సెకన్లు

--------------------------

వ్యవసాయేతర అవసరాలకు యూరియాను వినియోగించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. యూరియా సరఫరాపై జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో దృశ్యమాధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పంపిణీ వ్యవస్థలో సమస్యలను గుర్తించి లోపాలను సరిదిద్దాలని అన్నారు. యూరియా సరఫరా, లభ్యత విషయంలో రైతులకు అపోహలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. అవసరానికి మించి యూరియాను రైతులు కొనుగోలు చేయవద్దని సూచించారు.

--------------------------

కార్పొరేట్ సామాజిక బాధ్యత – సిఎస్ఆర్ నిధులతో ప్రతి మండలానికి అంబులెన్స్ సదుపాయం ఏర్పాటు చేస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ భూ నిర్వాసితుల ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని హైదరాబాద్ లో నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఉ పముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంతో పోటీ పడాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొంటూ..

వాయిస్.. 30 సెకన్లు

దేశంలో ఉత్తమ గ్రీన్ పవర్ ఉత్పత్తికి కేంద్రంగా తెలంగాణ ఉందని, జనవరి 15 నాటికి యాదాద్రి పవర్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేస్తామని అన్నారు.

కాగా. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పుడు 24 గంటల నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని వెల్లడించారు.

---------------------------

గోదావరి వరద ఉధృతి భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిందని నిన్న రాత్రి 8 గంటలకు నీటిమట్టం 43.4 అడుగులు మేర ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ధవళేశ్వరం వద్ద గతరాత్రి 8 గంటలకు ఇన్, ఔట్ ఫ్లో 13 లక్షల 42 వేల క్యూసెక్కులు ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజి వద్ద వరద ప్రవాహం క్రమంగా తగ్గే సూచనలు ఉన్నాయని వెల్లడించారు.

మరోవైపు విజయవాడ ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ప్రవాహం ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 4 లక్షల 33 వేల క్యూసెక్కులు ఉందని, మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని తెలిపారు.

---------------------------

తల్లికి వందనం పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అనుమతి ఇచ్చారు. ఇందుకు 325 కోట్ల రూపాయల విడుదలకు ఆమోదం తెలిపారు. విద్యాశాఖపై ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిన్న నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక నుంచి ప్రతి ఏటా డీఎస్సీ ప్రకటించి, ఖాళీలు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. శిక్షణా కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయుల సమయం వృథా చేయవద్దని సూచించారు. మెరుగైన ఫలితాలు వచ్చేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు.

---------------------------

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తొలిరోజు 9 జిల్లాల్లో పంపిణీ చేస్తామన్నారు. విజయవాడలో మంత్రి పాత్రికేయులతో నిన్న మాట్లాడుతూ.. సెప్టెంబర్ 15వ తేదీ వరకూ మొత్తం 4 విడతల్లో స్మార్ట్ కార్డులను అందిస్తామన్నారు. 25వ తేదీన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ఈ నెల 30, సెప్టెంబరు నెల 6, 15వ తేదీల్లో విడతల వారీగా మిగిలిన జిల్లాల్లో పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కార్డులు

పంపిణీ చేస్తామని పేర్కొంటూ...

వాయిస్... 30 సెకన్లు

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పాస్ పుస్తకాల ముద్రణ అనంతరం జాయింట్ కలెక్టర్ కార్యాలయం స్థాయిలో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల్లో వివరాలు డేటా ప్రకారం పరిశీలన చేస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం తుది దశకు చేరిందన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లోని రైతులకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామన్నారు. మంచి ఉద్దేశ్యంతో రైతులకు పాస్ పుస్తకాలు అందిస్తామని, అందరూ ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

---------------------------

బెట్టింగ్ యాప్ వల్ల జరుగుతున్న పరిణామాలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025 మంచి పరిణామమని విజయవాడకు చెందిన ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆన్ లైన్ గేమ్స్ వ్యసనంగా మారి ఆర్థిక నష్టాలకు, మోసాలకు గురైన వారికి న్యాయం జరిగేలా వారిని బాధితులుగా పేర్కొనడం ఆహ్వానించతగ్గదని ఆయన తెలియజేస్తూ,

వాయిస్... 42 సెకన్లు

---------------------------

దేశ వ్యాప్తంగా ఈరోజు జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 'ఆర్యభట్ట నుంచి గగన్యాన్ వరకు.. ప్రాచీన జ్ఞానం నుంచి అనంత అవకాశాల వరకు' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2023 ఆగష్టు 23 న చంద్రయాన్- 3 యాత్ర విజయవంతంగా ముగించి, విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై సురక్షితంగా దిగింది. దీంతో భారత్ చంద్రునిపై కాలు మోపిన నాల్గవ దేశంగా, దక్షిణ ధృవం చేరిన తొలి దేశంగా ఘనత సాధించింది. అలా ల్యాండర్ దిగిన ప్రాంతానికి ఇస్రో శివ శక్తి పాయింట్‌గా నామకరణం చేసింది.. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఈరోజు పలు అంతరిక్ష అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

=====================